# నాకీ అవతారాలు చాలు ప్రభూ!

భగవంతరావు ఘోరతపస్సు చేశాడు. భగవంతుడైన విష్ణుమూర్తి సాక్షాత్కరించాడు.

"స్వామీ! ప్రభూ" అంటూ మోకరిల్లాడు భగవంతరావు.

"నీ భక్తికి మెచ్చితి! నీకేం వరంకావాలి" అన్నాడు భగవంతుడు శ్రీవిష్ణువు.

భగవంతరావు తబ్బిబ్బై పోయాడు, ఏమడగాలో తోచక కాస్త బెంబేలుపడ్డాడు.

నిజంగా విష్ణుమూర్తి సాక్షాత్కరించాడా అని పరిశీలనగా చూశాడు.

శంఖ, చక్ర, గదాయుధాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న మూర్తి చిఱునవ్వుతో పలకరిస్తున్న తేజస్సు-అంతా నిజంగానే అగుపించింది

"నాకు దివ్యదృష్టి. పూర్వజన్మ జ్ఞానం మొదలైనవి కావాలి ప్రభూ" అన్నాడు భగవంతరావు.

"అవి కలియుగంలో అంత మంచివికావు" అన్నాడు విష్ణుమూర్తి.

భగవంతరావుకు కోపం వచ్చింది; సాక్షాత్తు భగవంతుడే ఆడిన మాట తప్పుతాడా, ఆశ్చర్యం!

"ఏమయినాసరే నాకు అవే కావాలి" అన్నాడు భగవంతరావు.

"ఇచ్చాను" అని అంతర్ధానమైపోయాడు ఆదివిష్ణువు.

భగవంతరావు ఆనందం పట్టలేకపోయాడు ఇంకేముంది యీదివ్య జ్ఞానంతో కోటానుకోట్ల ప్రజలను మభ్యపెట్టి కోటీశ్వరుడు కావచ్చుఅను కున్నాడు.

ఆనందం శ్రుతిమించి హఠాత్తుగా పెద్ద కేకవేశాడు సరదాగా, అల వాటు ప్రకారం.

ఆ కేకతో తలకు ఏదో దెబ్బ తగిలినట్లయింది.

కళ్ళు తెరిచాడు భగవంతరావు.

మంచంమీద తను మంచం కోడుకుతల...ఎదురుగా వంటింట్లోంచి వచ్చి గరిటితో ప్రత్యక్షమయిన భార్య.

భగవంతరావు నిరాశావృతుడై బాధపడిపోయాడు.

"ఏమండీ అంత కేకపెట్టారు? జడుసుకున్నారా" అంది భార్య నవ్వుతూ.

"ఆ! ఏంలేదు నమిలాడు మాటలు భగవంతరావు తన్ను చూసి పగలూ, రాత్రీ కలలోనూ, భయపడడం తన భర్తకు అలవాటే! అది తెలిసే భార్య ప్రశ్నించింది. లోనున్న ఆ వేదన చెప్పలేపోయాడు భగ వంతరావు.

ఎదురుగా ధృవుడు విష్ణుమూర్తి దర్శనం ఫోటో...అది చూస్తూ నిద్రపోగానే అదే కల్లోవచ్చేసింది.

నిజంగా దివ్యదృష్టి లభిస్తే ఎంత బాగుండును. అనుకున్నాడు భగ వంతరావు ఈ జన్మలో ఈ చిన్న యింట్లో యీ లావుపాటిభార్యతోఅర డజనుపిల్లలతో అరవైరూపాయలజీతంతో జీవితాలు గడపడం దుర్భ రంగా వుంది.

జ్యోతిషం చెప్పి వేలు గడించిన వారున్నారు. ఈ దివ్యజ్ఞానం

వస్తే ఎంత హాయి. తన్మయత్వంతో కళ్లుమూసుకున్నాడు ఎదురుగా ఉన్న దుర్భర జీవితం తల్చుకుంటూ...

ఏవేవో...అలలు...యింట్లోంచి తలపులు...

భగవంతరావు గబగబ నడుస్తున్నాడు.

వెనకనుంచి పిలుపు!

"ఏమ్ సునందా?

వెను తిరుగాడు భగవంతరావు...

కాదు సునంద.

వక్ష స్థలంమీద గబ్బి గుబ్బలు!

పట్టంచు చీర,

మల్లెపూల జడ.

కాలికి పట్టీలు

నడికి వడ్డాణం

చేతిలో జేబు రూమాలు.

నుదురుకు తిలకం

కాళ్ళకి పసుపు...

అర్థ మయింది...

పూర్వజన్మలో తానొక స్త్రీ.

సునంద ఆ పిలిచిన వాని వైపు చూసింది ఓరగా...

"ఎక్కడికి వెడుతున్నావు...

"పేరంటానికి?"

"ఎవరింటికీ?"

"పిన్నిగారింటికి!"

"సునందా...ఓ సారి...మా యింటికి రావూ...నాన్నా అమ్మా గోపాలపురం వెళ్ళారు..."

"రేపు"

సునంద నవ్వింది

"ఎన్నింటికి"

"మధ్యాహ్నం...2 గంటలకు"

ఇద్దరి మధ్య ఆనందం...

మర్నాడు రెండు గంటలకు తెల్లచీరలో అందంగా అలంకరించుకున్న సునంద అడుగుపెట్టింది ప్రియుడు యింట్లో. ఆమెకోసం నిరీక్షిస్తూ కూర్చున్న ప్రియుడు హఠాత్తుగాలేచి ఎదురువచ్చి తలుపువేసి కౌగిలించుకున్నాడు...ఆ ఆనందం...హా హా...అతని వక్షస్థలంమీద సునంద తలను ఆన్చి నవ్వుతూ అతనితల ముంగురులు నిమురుతూ అదో లోకం...

ప్రియుడి మీసాలుసునంద బుగ్గలను రాశాయిగరుగ్గా...అదోస్పర్శ సుఖం...

"నన్ను పెళ్ళి చేసుకోవూ..."

"నిన్నే చేసుకుంటా...ప్రతీ జన్మలో...నువ్వే కావాలి"

"ఎంత మంచి దానవు...సునందా"...

తెరలు...తెరలు...గా అలలు...అలలుగా...మార్పులు...

తూతూబాకాలు

బాజాలు...

పెళ్ళి హడావుడి

ఎదురుగా పెళ్ళి పీటలమీద అరవై ఏళ్ళ పెళ్ళికొడుకు...

ముడుతల ముఖం...బట్టతల పెద్ద బొజ్జ...ఆశతోటి నవ్వు చూపు...

సునంద ఒళ్ళు మండిపోతోంది.

పదివేలకు ఆశించి తండ్రి బలంతంగా కట్టబెడుతున్నాడు...

హాయిగా చదువుకొని ఉన్నా యీ పెళ్ళికాకపోయేది_అనుకుంది ...మొగాడైతే హాయిగా చదువు చెప్పించేవాడు నాన్న...అడదైతే చదువెందుకూ పెళ్ళి తప్ప...అంటాడు...డబ్బు ముఖ్యం అంటాడు

నాన్న...అందుకే డబ్బున్న ముసలిని కట్టపెట్టాడు...మొగాడై పుడితే సుఖం? లోలోపల ఆలోచనతో ఏడ్చింది సునంద...

గదిలో ముసలి భర్త...

ఎదురుగా వచ్చి ముద్దు పెట్టుకున్నాడు...

ముసలి వాసన...

నోటి నుంచి చొంగ...

థు థు!

ఉమిసింది...

ఆ ముసలాడు సునందను పీడిస్తున్నాడు...

కళ్ళు మూసుకుంది వాడి ముఖం చూడలేక...

ఏదేదో తడుముతున్నాడు.

రామ రామ!...

బాధపడి ఈసడంచుకుంది లోలోపల...

ముసలాడు అలసిపోయి వాలిపోయాడు మంచంమీద.

సునంద వెక్కివెక్కి ఏడ్చింది. కళ్ళముందు ప్రియుడు కదిలాడు. పెళ్ళి పందిరిలో దీనంగా పెట్టిన అతని ముఖం. ఏదో అనంతమైన బాధ.

ఈ బ్రతుకుకంటె చనిపోవడం మంచిది.

ప్రియుడితో లేచిపోయే ధైర్యంలేదు. మొగాడై పుడితే ఎంత హాయి... అదే ఆలోచన!

మర్నాడు సాయంత్రం యధారీతిగా అలంకరించుకుంది. చీకటి పడింది. ఇంట్లో పెద్దలు భోజనాలు చేస్తున్నారు. భర్త తన జీవితంలోని వివిధ అనుభవాలు తీవిగా వల్లెవేస్తున్నాడు. దొడ్లో నూతిలో ధడ్‌మని శబ్దం... పాలేరు కేక.

జనం నూతివైపు పరిగెత్తారు. ఏవేవో కేకలు.

సునంద నూతిలో మునిగి నీళ్లు తాగుతోంది.

ప్రాణం పోతోంది.

ఊపిరాడటంలేదు.

పెద్ద కేక.

మెలకువ వచ్చేసింది...

భగవంతరావుకు

భార్య గుర్రుపెట్టి నిద్రపోతుంది.

పూర్వజన్మలో తాను సునందా? ముసలాడితో పెళ్ళయిందా?

ఛ ఛ ఛ ! వెధవ జీవితం.

సునంద జన్మ ముందు జన్మలో మరెవరినో !

ఏదో ఎలకపిల్ల భుజంమీద గెంతేసి వెళ్ళిపోయింది.

తలనొప్పి...

చంటిపిల్లాడు ఏడ్చాడు...

వెళ్ళి సముదాయించి ఉయ్యాల ఊపాడు భగవంతరావు. ఆవలింతలు వచ్చాయి.

మళ్ళీ ఒరిగాడు నులకమంచంమీద.

బాలింతలాగ తాను నుఃకమంచంమీద, భార్య పట్టె మంచంమీద ఛీ! వెధవ బ్రతుకు అనుకున్నాడు...

ఒరిగాడు ఓ నిమిషం...

మళ్ళీ ఏవేవో ఆలోచనలు.

అలలు... కలలు...

తెరలు...

కుక్క పరుగెడుతోంది...

ఎవరో కుర్రాడు రాయి విసిరాడు.

భోంయిమంది...

భగవంతరావులాగా మొరిగిందే...

ఎవ్వాడు ఓ పెద్ద మనిషి?

నేనా...?

కాకు తాన్ను తాను పరిశీలించుకూంది...

పిచ్చమ్మ పిన్నిగారి వాకిలివద్ద కాపలాకాసింది.

భోగయ్యగారు భోంచేసి అరటితొక్క విసిరాడు వీధిలోకి...

కుక్క వాసన చూసింది.

ఆ తొక్క... విడిచేసింది...

పిచ్చమ్మగారు పుల్లిస్తరి వీధిలోకి వచ్చి విసిరింది...

కుక్క ఎగబడింది...

నాకింది ప్రక్కకు పిల్లి జేరితే అరిచింది...

కోపంతో మళ్లీ కరిచింది పిల్లి బుసకొట్టింది.

చలి...

గజగజ వణికింది కుక్క.

ఒంటిమీద గజ్జి దురద...

ముఖం ముడుచుకు పడుకుంది...

రాత్రి పిచ్చమ్మగారు గదిలోంచి మంచినీళ్ళు తాగి మిగిలినవి కిటికీ లోంచి తనమీదకు విసిరారు. కుంయేమని మూల్గింది కుక్క... పిచ్చమ్మలా బ్రతుకుతే పోయి అనుకుంది కుక్క.

ఒరోజు... భోజనంలేక విలవిలమాడి తిరుగుతూ వుంటే... మరోకుక్క జబర్దస్తీగా తన్నుచూసి మొరిగివచ్చి కరిచింది, కాటు పెద్ద

దయ్యింది. ఊరు చివర మర్రిచెట్టు మూలకూలి. ఏడ్చి, మొరిగి, ప్రాణం వదిలింది కుక్క... ఎదురుగా పిచ్చమ్మ కనపడింది చచ్చేటప్పుడు, పాకి వాళ్ళు మొర్నాడు ఈడ్చేసారు...

మరికొన్ని కుక్కలు భౌంయ్‌మన్నాయి.

భౌంయ్... భౌంయ్... అన్నాడు కలవరింతల్లో భగవంతరావు. మెలకువ వచ్చేసింది.

మెలకువ రాగానే భగవంతరావు ఏడ్చాడు.

నేను కుక్కనై పుట్టానా?

పూర్వం ఆడదాన్నై బ్రతికానా? ఛీ...! అయినా

ఆ జన్మలకంటె యిందేం మెరుగు?

మునుపటి కుక్క బ్రతుకు, పూర్వం స్త్రీ బ్రతుకు, నేటి మొగాడి బ్రతుకు ఒకలాగే వున్నాయి. ఇప్పుడు మగవాడికంటె స్త్రీ బ్రతుకుహాయి! స్త్రీ బ్రతుకుకంటె కుక్క బ్రతుకు హాయి! ఆడదానికే అన్ని భోగాలు, అవకాశాలూ! పెంపుడుకుక్క అంతకుమించినవీ!

నేను ప్రతిజన్మలోనూ తప్పుడు బ్రతుకే బ్రతికేను!

భగవంతరావు ఏడ్చాడు?

ఏడ్చి ఏడ్చి నిద్రపోయాడు...

కల... అలలు... తెరలు...

ఎవరో దొరసాని...

దూదూ... అంటోంది...

కుక్క... పొతకగా, నిగనిగలాడుతూ... నలుపూ... తెలుపు రంగుల్లో అందంగా వుంది.

ఎగిరివచ్చి దొరసానిమీద కూర్చుంది. మూతి నాకింది... దొరసాని శరీరమంతా వాసన చూసింది.

దొరసాని కుక్కను కౌగిలించుకుంది...

చేతిలో బిస్కట్లు పెట్టింది...

కౌగితం విసిరి తెమ్మంది.

కుక్క తెచ్చింది.

షేక్‌హాండ్ యిమ్మంది.

కుక్క యిచ్చింది.

పరుపు ఎక్కమంది.

కుక్క ఎక్కివచ్చి దొరసాని ప్రక్కలో దూరింది...

"టామీ! టామీ!" అంటూ ముద్దుల వర్షం కురిపించింది దొరసాని.

అటువంటి కుక్కలా బ్రతుకుతే ఎంతహాయి...

అలలు... తెరలు... కలలు...

విష్ణుమూర్తి ప్రత్యక్షం!

స్వామీ మన్నించండి... పొరపాటు వరం కోరుకున్నా... అలా దొరసాని కుక్కలా బ్రతికేలా చేయండి!!

శ్రీ విష్ణువు నవ్వాడు.

వరం ప్రసాదించాడు...

అలలు... కలలు... తెరలు...

లావుపాటి దొరసాని...

టామీ ఆడుకుంటున్నారు...

దొరసాని మారుతో అంది.

రూపం...

హాశ్చర్యము!

దొరసానికాదు... భగవంతరావు భార్య.

అది కుక్కకాదు- భగవంతరావే...

గరిటతో అన్నం పెడుతోంది... తిడుతూ...

కోపంతో గుద్దులు విసిరింది... ముద్దులు బదులు...

జీలకర్రతే!

ఉప్పుతే!

డబ్బుతే!

నగలుతే!

కోపంతో దారిచూపించింది ఆమె.

0/3009

భగవంతరావు పరుగెత్తి కెళ్ళి ఒక్కొక్కటి తెచ్చియిస్తున్నాడు.

యివి చాలవు!

మళ్ళీ!

ఇంకో పరుగు...?

హేహెహే... నవ్వు— ఆమె!!

"అమ్మగయ్యాళీ!"

భగవంతరావు అరిచాడు...

ఆ అరుపు వింది భగవంతరావు భార్య.

దొంగ బుద్ది!

దొంగ కుక్క బుద్ధి!

అంటూ అడిగింది... ఆమె ఎదురుతిరిగి.

గుమ్మం కడుగుదామని వెడుతూన్న ఆమె వేన్నీళ్ళ చెంబు కలవరించే భర్త మీద విసిరింది.

భగవంతరావు... ఊపిరాడక లేచాడు. అతని నులకమంచం వేన్నీళ్ళతో పవిత్రమయింది... ముఖమంతా వాసన...

"ఇదేమిటే?" అని నీల్గాడు భగవంతరావు.

"నోర్ముయ్! లేచి ముఖం కడుక్కో! నేను గయ్యాళినా...?ఒకటే కలవరింత... మనస్సుల్లో మాట ఎంతకాలం దాగుతుంది...? గొల్లుమని ఏడ్చింది ఆమె.

భగవంతరావు లేచాడు దీనంగా.

ఎదురుగా ధృవుడికి విష్ణుమూర్తి దర్శనం ఫోటో.

"ఈ జన్మ ఎప్పుడు అంతమవుతుంది ప్రభూ!" దీనంగా దణ్ణం పెట్టుకున్నాడు భగవంతరావు.

భగవంతరావు భార్య ఏడ్పులు గదిలోని గంటల్లా... ఒకటే గింగురులు... శబ్దాలు... ధ్వనులు... రాగాలు...

భగవంతరావు ఒక నిట్టూర్పు విడిచాడు... "అసలు నాకు ఏజన్మా వద్దు ప్రభూ! నా అవతారాలు ఇంక చాలు ప్రభూ!" లోలోపలే ప్రార్థించుకున్నాడు భగవంతరావు తన భగవంతుణ్ణి.

***